దద్దరిల్లిన జడ్పీ..!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య





ఎమ్మెల్యే పార్థసారథి ప్రసంగానికి అడ్డుతగులుతున్న జడ్పీటీసీ సభ్యులు

- ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై రచ్చ
- ఎమ్మెల్యేలు, జడ్పీటీసీల మధ్య వాగ్వాదం
- బ్రాహ్మణకొట్కూరులో మద్యం దుకాణంపై దుమారం
- వాడివేడిగా జడ్పీ సమావేశం
- హాజరైన మంత్రి భరత్, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ సమావేశం వాడీవేడిగా సాగింది. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులపై జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేల నడుమ తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఆదివారం కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు,నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి.రంజిత్‌బాషా, రాజకుమారి, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా ఉదయం 9 గంటలకు జడ్పీ మినీ సమావేశంలో భవనంలో 1, 2కు సంబంధించి స్థాయి సంఘ సమావేశాలు జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. డీఆర్‌డీఏ, డ్వామాకు సంబంధించిన శాఖలపై చర్చించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సుమారు 5,924 పనులకు రూ.65,91,90,046 నిధులకు సభ్యులు తీర్మానించారు. అదే విధంగా పాఠశాలలో విద్యావ్యవస్థను బలోపేతం చేసే విధంగా టీచర్ల కొరత నివారించేందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకురావడానికి సభ్యులు సమావేశంలో లేవనెత్తారు.ఈ మేరకు జడ్పీ చైర్మన్ ప్రభుత్వానికి ఈ విషయాన్ని పంపిస్తూ సభలో ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

● ఆర్థిక సంఘం నిధులపై వాగ్వాదం

కూటమి ప్రభుత్వం వచ్చాక 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. అయితే తమ హయాంలో విడుదలైన నిధులను ఖర్చు చేయకుండా వైసీపీ సర్పంచులు గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించి జమ చేసుకోవడం దారుణమన్నారు. వైసీపీకి చెందిన సర్పంచులు ఊళ్లకు ఊళ్లు దోచుకుంటున్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇంతలో కొత్తపల్లి జడ్పీటీసీ సుధాకర్ కలగజేసుకుని సర్పంచులపై ఆరోపణలు చేయడం తగదని ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు రాకపోవడంతోనే సర్పంచులు ప్రస్తుతం వచ్చిన నిధులను జమ చేసుకుంటున్నారు.. ఇందులో తప్పేముందని అన్నారు. చేసిన దుర్మార్గాలు బయటపెడితే ఎందుకు జంకుతున్నారని ఆదోని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. తాను మాట్లాడుతుంటే ఎందుకు మధ్యలో కలగజేసుకుంటారని ఆదోని ఎమ్మెల్యే జడ్పీటీసీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతబకాయిలలో జమచేసుకుంటున్న వాటిపై విచారణ జరిపించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పట్టుబట్టారు.

మిగతా 7వలో..

అధికారులు ఏమి చేస్తున్నారు
- టీజీ భరత్, మంత్రి

తాగునీటికి సంబంధించి వేసిన టెండర్లలో కాంట్రాక్టర్లు తక్కువకు కోట్ చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారు. రెండు నెలల నుంచి ఇదే ప్రక్రియ జరుగుతుంటే కూడ చూసుకోవాల్సిన పరిస్థితి లేదా? రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి మరమ్మతు పనులు నాణ్యతతో జరిగేలా చూడండి. టెండర్లలో 30-40 శాతం తక్కువ చేసి కోట్ చేస్తే మరమ్మత్తు పనులు ఏ విధంగా నాణ్యతతో చేస్తారు. 20 శాతం తక్కువ కోట్ చేస్తేనే పనులు నాణ్యతతో ఉండవు..అలాంటిది సుమారు 40 శాతం మేరకు తక్కువ చేసే పనుల్లో నాణ్యత ఉంటుందా? ఉమ్మడి జిల్లాలో ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి స్కీంలపై వివరాలు అందజేయాలి. ఆదోని మండలం సంబగల్లులో మురుగుల కాలవలు వెళ్తున్న లైన్‌లోనే తాగునీటి పైప్‌లైన్ ఉండటం వల్ల డయేరియా లాంటి వ్యాధులు సోకే ప్రమాదముంది. వచ్చే సమావేశం నాటికి ఈ విషయాన్ని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రజాప్రతినిదులు చెప్పిన సమస్యలపై వెంటనే స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలి.

రాష్ట్రంలో తిరిగే అర్హత
జగన్‌కు లేదు

- 26 లోపు సభ్యత్వాలు పూర్తి చేయాలి
- ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తిరిగే అర్హత జగన్‌రెడ్డికి లేదు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి టీజీ భరత్‌తో కలిసి ఆయన ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, కార్పొరేషన్ల డైరెక్టర్లతో సభ్యత నమోదు కార్యక్రమంపై సమీక్షించారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత జగన్‌రెడ్డి కాలయాపన రాజకీయాలకు చేస్తున్నారడని, అయన్ను ప్రజలే తిరస్కరించారన్నారు. గత ఐదేళ్ల కాలంలో పరదాల చాటున ప్రజల్లో తిరిగిన జగన్‌కు కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,90,073 మంది సభ్యత్వాలు తీసుకున్నారని, ప్రతి నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును ఈనెల 26 లోపు పూర్తి చేసే దిశగా పని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్‌బాబు, బొగ్గుల దస్తగిరి, ఇన్‌చార్జ్‌లు రాఘవేంద్ర రెడ్డి, వీరభద్రగౌడ్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బోయ, కురువ కార్పొరేషన్ల చైర్మన్లు కప్పట్రాళ్ల బొజమ్మ, మాన్వి దేవేంద్రప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లపై నేడు విచారణ
-ఎరుకులచెరువుకు ప్రత్యేక బృందాలు



కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా మంజూరైన పింఛన్లపై అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. గత వైసీపీ పాలనలో దివ్యాంగులు, ఇతర కేటగిరీ విభాగాల్లో అనర్హులకు భారీగా పింఛన్లు మంజూరు చేశారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో తొలి విడతలో భాగంగా జిల్లాకు ఒక గ్రామ, వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తారు. ఈ మేరకు కృష్ణగిరి మండలంలోని ఎరుకుల చెరువులో 349 పింఛన్లపై అధికారులు విచారణ చేపట్టనున్నారు. కర్నూలు, కల్లూరు ఎంపీడీఓ కార్యాలయాల నుంచి ఐదేసి బృందాలు విచారణలో పాల్గొంటాయి.

ఆర్‌యూలో ఖజానా ఖాళీ..!

- విద్యార్థుల ఫీజుల నుంచే జీతాలు
- ఏటా రూ.10 కోట్లు చెల్లిస్తున్న రాయలసీమ వర్సిటీ
- భారంగా మారిన 296 మంది ఉద్యోగులు వేతనాలు



కర్నూలు అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ద్రావిడ వర్సిటీ పరిస్థితే రాయలసీమ యూనివర్సిటీకి రానుందా.. విద్యార్థుల ఫీజుల నుంచి జీతాలు చెల్లించడంతో ఖజానా ఖాళీ కానుందా.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవుననే చెప్పాలి. పొరుగు సేవల కింద అడ్డగోలుగా ఉద్యోగాలు ఇచ్చిన ద్రావిడ వర్సిటీ వారి జీతాల చెల్లింపునకు విద్యార్థుల ఫీజులను వాడుకోవడంతో ఖజానా ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాయలసీమ యూనివర్సిటీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థులు చెల్లించిన ఫీజుల నుంచి ఏటా రూ.10 కోట్ల దాకా ఉద్యోగులకు జీతాలు చెల్లించడమే ఇందుకు కారణం. రాష్ట్రంలో 12బీ గుర్తింపు ఉన్న వర్సిటీలో రాయలసీమ యూనివర్సిటీ ఒక్కటి. ఇందులో ఏడుగురు అధ్యాపకులు మాత్రమే సీఎఫ్ఎంఎస్ నుంచి జీతాలు తీసుకుంటున్నారు. మరో 24 మంది నాన్ టీచింగ్ రెగ్యులర్ ఉద్యోగులకు ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ నుంచి జీతాలు గత జూన్ 5 నుంచి నిలిపివేసింది. దీంతో వారికి వర్సిటీ నుంచి విద్యార్థుల ఫీజుల నుంచి జీతాలు ఇస్తున్నారు. ఇప్పుడే ఇదే యూనివర్సిటీకి పెనుభారంగా మారింది. 2017లో 102 మంది ఉద్యోగులకు టైం స్కేల్ గుర్తింపు ఇవ్వడం రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు వ్యతిరేకమని, రద్దు చేయాలని అప్పటి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు వర్సిటీ ఉపకులపతులను ఆదేశించినా పట్టించుకోలేదు. దీంతో వర్సిటీ ఉద్యోగులకు నెలకు రూ.80 లక్షల ప్రకారం ఏడాదికి రూ.10 కోట్ల మేర జీతాలు చెల్లించాల్సి వస్తోంది. అయితే ఈ మొత్తం విద్యార్థుల ఫీజులు, ప్రైవేట్ డిగ్రీ, బీఈడీ కళాశాలల నుంచి వచ్చే డబ్బుతో సర్దుబాటు చేస్తున్నారు. ఇలా చేయడం ఎంత వరకు సమంజసమని కొందరు ప్రొఫెసర్లు అంటున్నారు. దీంతో రాయలసీమ యూనివర్సిటీ ఖజాన ఖాళీ అయి ద్రావిడ వర్సిటీ తరహాలో అవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

● ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

జీతాలు విద్యార్థుల ఫీజుల నుంచి ఇస్తున్న మాట వాస్తవమే. ఆ సమస్యపైనే దృష్టి సారించాను. గతంలో జాప్యం ఎందుకు జరిగిందో నాకు తెలియదు. సీఎఫ్ఎంఎస్ డేటాలో ఉద్యోగులను చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నత విద్యామండలికి ఫైలు సిఫారసు చేస్తున్నాం.

- బోయ విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, రాయలసీమ యూనివర్సిటీ



డ్రగ్స్ రహిత
రాష్ట్రమే లక్ష్యం

- 459 మంది సిబ్బందితో ఈగల్ టీమ్
- ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన సదస్సులు
- ఈగల్ అధిపతి ఐజీ ఆకే రవికృష్ణ

7లో



దిగొచ్చిన టమోటా

ఎమ్మిగనూరు మార్కెట్‌లో 20 కిలోల బాక్స్ రూ.300

గోనెగండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నెల రోజులుగా అధిక రేట్లకు అమ్ముడపోయిన టమోటా ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. ఎమ్మిగనూరు మార్కెట్‌లో 20 కిలోల బాక్స్ రూ.350 నుంచి రూ.300 వరకు ధర పలికింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారులు రూ.100కు ఆరు కిలోల ప్రకారం ఆటోల్లో తిరిగి విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో నాలుగు రోజుల వ్యవధిలో కిలో రూ.50 నుంచి రూ.16కు ధర తగ్గడంతో వినియోగదారులు ఉపశమనం పొందుతున్నారు. ఇప్పటి వరకు గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాలలో దాదాపు 200 ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశారు. బావులు, బోర్ల కింద సాగు చేసిన పంట 15 రోజుల్లో మరో 200 ఎకరాల్లోని పంట కోతకు వచ్చే అవకాశం ఉంది. దీంతో ధర మరింత తగ్గనుంది.



రైతుబజార్ల విస్తరణకు ఏర్పాట్లు

అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం ప్రభుత్వం గతంలో రైతుబజార్లను ఏర్పాటు చేసింది. రైతుబజార్ల అభివృద్ధిపై చంద్రబాబు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. సీక్యాంపు రైతుబజారులో కూరగాయల కొనుగోలుకు ప్రతి రోజూ దాదాపు నగరంలోని నలుమూలల నుంచి ఏడు వేల మంది వినియోగదారులు వస్తున్నారు. దాదాపు 20 వేల క్వింటాళ్ల దాకా కూరగాయలు అమ్ముడుపోతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని రైతుబజార్లలో కర్నూలు సీ క్యాంపు రైతు బజారు ప్రథమ స్థానంలో ఉన్నట్లు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో తేలింది. అయితే.. నగరంలోని కొత్తపేట, అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజార్లు మాత్రం ఇటు రైతులకు, అటు ప్రజలకు అరకొరగానే సేవలు అందిస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆరు రైతు బజార్లను పైలట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ రైతుబజార్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఉన్న రైతుబజార్లను ఏ మాత్రం పట్టించుకోకపోగా కొత్తగా మరి కొన్ని రైతు బజార్లను అందుబాటులోకి తీసుకురావాలనే ప్రతిపాదనను సమాధి చేసింది. అయితే.. మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో కూరగాయలు పండిస్తున్న రైతులతోపాటు ప్రజల్లో ఆశలు చిగురించాయి.

● విస్తరణ షురూ:

సీ క్యాంపు రైతుబజారులో ఆర్‌అండ్‌బీకి సంబంధించిన పది శిథిలావస్థకు చేరిన భవనాలను రైతుబజార్ విస్తరణ కోసం కేటాయించారు. గతంలోనే ఈ భవనాలను కూల్చివేసి సీ క్యాంపు రైతుబజారును విస్తరించేందుకు రూ.4.50 కోట్లు మంజూరు చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో రైతుబజార్ విస్తరణ పనులు అటకెక్కాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ బిల్డింగులను కూల్చివేసి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అడుగులు పడ్డాయి. ఇటీవలె మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత విస్తరణకు సంబంధించిన ప్రాంతాన్ని సందర్శించారు. వెంటనే ప్రతిపాదనలు పంపాలని, నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పంపారు. అదేవిధంగా కొత్తపేట రైతుబజారులో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించడంతోపాటు రైతుబజారును విస్తరించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజారులో కూడా అవసరమైన షాపులు, ఖాళీ ప్రదేశాలు ఉండటం వల్ల రైతుబజారు ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అధికార వర్గాలు తెలిపాయి. ఆదోనిలో రైతుబజారు విస్తరణకు అవసరమైన ప్రతిపాదనలు చేస్తున్నామని, గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించి దళారుల చేతుల్లో మోసపోకుండా కూరగాయలను రైతుబజారులోనే అమ్ముకునేందుకు చర్యలు చేపడుతున్నారు.

● కల్లూరులో పది రోజుల్లో ప్రారంభం





మరో పది రోజుల్లో ప్రారంభం కానున్న కల్లూరు గోవర్ధన రైతుబజార్

రైతుబజార్లను విస్తరిస్తాం

ప్రస్తుతం ఉన్న రైతుబజార్లను విస్తరించి రైతులకు గిట్టుబాటు ధర అందించడంతోపాటు ప్రజలకు నాణ్యమైన చౌక ధరకు కూరగాయలను అందించేందు కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందు కోసం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉంది. రైతుబజారును విస్తరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. మరో పది రోజుల్లోని కల్లూరులోని గోవర్ధన రైతుబజార్‌ను పూర్తిగా రైతులకు అందుబాటులోకి తెస్తాం.

- నారాయణమూర్తి, ఏడీఎం



సీ క్యాంపు రైతుబజారు విస్తరణ కోసం స్వాధీనం చేసుకున్న ఆర్‌అండ్‌బీ భవనాల స్థలం

నేటి నుంచి సమ్మెలోకి ఇంజనీరింగ్ విభాగం కార్మికులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. 20 ఏళ్లుగా ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు జీతాలు పెంచాలని వారం రోజులుగా రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులకు యూనియన్ నాయకులు వినతి పత్రాలు అందజేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. సోమవారం ఉదయం 10గంటలకు అశోక్‌నగర్‌లోని పంప్‌హౌస్ నుంచి నగర పాలక సంస్థ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిసింది. ఇందులో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, పంప్‌హౌస్‌లో పని చేస్తున్న కార్మికులు, నగర పాలక కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, తాగునీరు సరఫరా చేసే సిబ్బంది, వీధి దీపాలు సంబంధించిన సిబ్బంది తదితర కార్మికులు పాల్గొంటున్నారు.

7వ జిల్లా స్థాయి ఉషూ పోటీలు ప్రారంభించిన టీజీవీ



మార్షల్ ఆర్ట్స్ క్రీడలను ప్రారంభిస్తున్న మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కిడ్స్ వరల్డ్ రోశయ్య కమ్యూనిటీ హాలులో ఆదివారం 7వ జిల్లా స్థాయి ఉషూ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి మార్షల్ ఆర్ట్స్ ఉషూ క్రీడాకారులను ప్రోత్సహించాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలపై మక్కువ పెంచేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ 300 మంది క్రీడాకారులు ఉషూ పోటీల్లో పాల్గొన్నారన్నారు. అండర్-12, 15, 18 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, రెఫ్రీలు సుధాకర్, చిన్న శ్రీ నివాసులు, అనుమతీశ్వర్, నాగ సులోచన, మధు, మేఘన, కార్యదర్శి టి.శ్రీనివాసుల పాల్గొన్నారు.

దద్దరిల్లిన జడ్పీ

(5వ పేజీ తరువాయి)

ఏ గ్రామంలో జరిగిందో చెబితే విచారణకు సిద్ధమని కోసిగి జడ్పీటీసీ పవిత్రా పాటిల్‌తో పాటు ఇతర జడ్పీటీసీ సభ్యులు ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. మీరు చేసిన అరాచకాల వల్లే ప్రజలు వైసీపీకి 11 సీట్లకే పరిమితం చేశారని నందికొట్కూరు ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ వ్యవస్థలకు వైసీపీ ప్రభుత్వం ఒక్క పైసా కూడా విడుదల చేయలేదన్నారు.



కోసిగి జడ్పీటీసీ సభ్యురాలితో ఎమ్మెల్యే జయసూర్య వాగ్వాదం

● బ్రాహ్మణకోట్కూరులో వైన్‌షాప్‌పై దుమారం

నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని జడ్పీ పాఠశాల వద్ద వైన్‌షాపు పెట్టడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని నందికొట్కూరు జడ్పీటీసీ సభ్యురాలు షేక్ కరీమున్నిసా సభ దృష్టికి తీసుకువచ్చారు. ఇంతలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కలగజేసుకుని 'ఎందుకు ఇక్కడ మాట్లాడుతున్నావు.. ముందు కూర్చో..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతలో జడ్పీటీసీలు ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డారు. బడి, గుడి వద్ద వైన్‌షాపులు పెట్టకూడదని నిబంధనలు ఉన్న ఎలా ఏర్పాటు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పిల్లలు గంజాయికి అలవాటుపడ్డారని ఎమ్మెల్యే అన్నారు. నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నిబంధనలు ప్రకారమే అయితే పాఠశాల వద్ద ఎలా ఏర్పాటు చేస్తారని కోసిగి, దేవనకొండ, జడ్పీటీసీ సభ్యులు ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

● జేజేఎం గడువు పెంచాలి
- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే



జలజీవన్ మిషన్ పథకం గడువు పెంచాలి. జేజేఎం కింద రూ.25 వేల కోట్లు మంజూరయ్యాయి. గత ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే వినియోగించింది. జేజేఎం మరో రెండేళ్లు గడువు పెంచితే అందరికి తాగునీటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఆర్అండ్‌బీ కింద ప్యాచ్ పనులు చేస్తున్నారు. అదే విధంగా పంచాయతీరాజ్ విభాగం అధ్వర్యంలో కూడ ప్యాచ్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

● అభివృద్ధికి సహకరిస్తాం
- ఎర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీ చైర్మన్



ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి సహకరిస్తాం. ఏదైనా తప్పు జరిగితే తక్షణమే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలకు ఆదేశిస్తాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే నిధులు విడుదల చేస్తున్నారు. గ్రామ,మండల స్థాయిలో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. అధికారులు ఏ గ్రామానికి వెళ్లిన తప్పకుండా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వండి.

● ఆస్పరి మండలంలో గతంలో నాతనహల్లి స్కీం కింద 15 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుందని, ప్రస్తుతం 15 గ్రామాలకు అక్రమంగా కనెక్షన్లు ఇవ్వడంతో ముందు గ్రామాలను నీరు రావడం లేదని జడ్పీటీసీ దొరబాబు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే విచారించి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మహనంది మండలం గాజులపల్లె వద్ద బసాపురం గ్రామంలో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని జడ్పీటీసీ కోరారు. కొత్తపల్లి మండల పరిధిలో కొన్ని చోట్ల కరెంటు పోల్స్ వంగి ఉన్నాయని వాటిని మార్చాలని జడ్పీటీసీ అన్నారు. ఆర్థిక సంఘం నిధులపై బెళగల్ మండలం కొండాపూర్ గ్రామంలో అవినీతి జరిగిందని తక్షణమే విచారణ జరిపించాలని కోరారు. హలహర్విలో ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది తక్షణమే నూతనంగా నిర్మించాలని జడ్పీటీసీ కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ చల్లాకళ్యాణి, జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటి సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కురువ కార్పొరేషన్ చైర్మన్ నాగేంద్రప్ప, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



జడ్పీ సమావేశానికి హాజరైన జడ్పీటీసీ సభ్యులు

డ్రగ్స్ రహిత రాష్ట్రమే లక్ష్యం

- ● 459 మంది సిబ్బందితో ఈగల్ టీమ్
- ● ఎన్‌డీపీఎస్ చట్టాలపై అవగాహన సదస్సులు
- ● తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలి
- ● ఈగల్ అధిపతి ఐజీ ఆకే రవికృష్ణ

కర్నూలు క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయడమే (ఎలైట్ యాంటి నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఈగల్ ముందున్న లక్ష్యమని ఈగల్ అధిపతి ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. కప్పట్రాళ్ల పర్యటనలో భాగంగా కర్నూలు వచ్చిన ఆయనతో ఆంధ్రజ్యోతితో ఈగల్ టీం లక్ష్యాలను పంచుకున్నారు. ఏపీలో ముఖ్యంగా విద్యార్థులు మత్తుకు బానిస కాకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. ఆ దిశగా పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తున్నాయని అలాంటి సప్లయ్ చేసేవారితో పాటు తీసుకున్న వారు కూడా నేరస్థులేనని పేర్కొన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని సూచించారు.

● ప్రశ్న: ఈగల్ టీమ్ ఎలా పని చేస్తుంది..?

● **ఈగల్ చీఫ్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈగల్ టీమ్ ఏర్పాటైంది. 459 మంది సిబ్బందితో ఈగల్ టీమ్ పని చేస్తుంది. అన్ని జిల్లాలో ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఇద్దరు ఎస్పీలు, ఇద్దరు అడిషినల్ ఎస్పీలు, ఆరు మంది డీఎస్పీల ఆధ్వర్యంలో రాష్ట్ర హెడ్ క్వార్టర్‌లో ఈ టీమ్ ఉంటుంది. డేటా ఎనాలసిస్, టెక్నికల్ ఎనాలసిస్ అంశాలతో ప్రత్యేకంగా రూపొందించారు. ప్రతి జిల్లాకు ఒక టీం సిబ్బంది ఏర్పాటు చేస్తున్నాం. తీవ్రమైన కేసుల్లో ఈగల్ మెయిన్ టీమ్ కోఆర్డినేషన్ చేస్తుంది.

● ప్రశ్న: ఇతర రాష్ట్రాలతో ఎలా సమన్వయం చేసుకుంటున్నారు

● **ఈగల్ చీఫ్:** ముఖ్యంగా గంజాయి ఎక్కువగా ఉండే ఒడిస్సా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో సమన్వయం చేసుకున్నాం. ఆయా రాష్ట్రాల్లో ఉన్న సరిహద్దులోని ఎస్పీలు నేరుగా కోఆర్డినేషన్ చేసుకుంటారు. కోరాపూర్, మల్కన్‌గిరి, గంజామ్, రాయ్‌ఘడ్ జిల్లాల ఎస్పీలతో ఇప్పటికే చర్చించాం. మన రాష్ట్రంలోని శ్రీకాకుళం, మన్యం జిల్లాల ఎస్పీలు కూడా సరిహద్దు రాష్ట్రాల ఎస్పీలతో ఒక టీమ్‌గా ఏర్పడ్డారు. ఇప్పటికే పంజాబ్ ఏఎన్‌టీఎఫ్‌తో చర్చించాం. అక్కడ వారు అవలంబిస్తున్న విధానాలను స్టడీ చేశాం. ముఖ్యంగా ఎస్‌టీడీడీ (సోర్స్, ట్రాన్స్‌పోర్టేషన్, డెస్టినేషన్, డిమాండ్)పై దృష్టి సారించాం. ఎక్కడైతే.. గంజాయి, డ్రగ్స్ సప్లయ్ తయారు చేస్తున్నారో అక్కడ తనిఖీలు చేస్తాం. ఆ తర్వాత ఏయే మార్గాల ద్వారా రవాణా జరుగుతుందో గుర్తించే ప్రణాళికలు రూపొందించుకుంటాం. ఆ తర్వాత మత్తు పదార్థాలు సరఫరా అయ్యే చివరి ప్రాంతాలు కూడా గుర్తించేందుకు మా టీములు రంగంలో దిగుతాయి.

● ప్రశ్న: డ్రగ్స్ వాడే వారిపై ఎలాంటి చట్టాలు ఉన్నాయి..?

● **ఈగల్ చీఫ్:** డ్రగ్స్ సప్లయ్ చేసినా, వాడినా ఇద్దరూ నేరస్థులే. ఎన్‌డీపీఎస్ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడితే గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్ష ఉంటుంది. ఇతర కేసుల్లో కేసు నిరూపించాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉంటుంది. ఈ డ్రగ్స్ కేసులు నిరూపించుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంటుంది కాబట్టి చాలా ఇబ్బందులు పడుతారు. కేసుల్లో బెయిల్ కూడా దొరకదు. డ్రగ్స్ తీసుకున్న వారిపై కూడా కేసులు నమోదవుతాయి. అలాగే అమ్మినవారు, కొన్నవారి పేర్లను సెంట్రల్ గవర్నమెంటు రూపొందించిన నిధాన్ పోర్టల్‌లో నమోదవుతాయి. భవిష్యత్తులో చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

● ప్రశ్న: ఎలాంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నారు..?

● **ఈగల్ చీఫ్:** డ్రగ్స్ విద్యాసంస్థల్లోకి వెళ్లకూడదన్నది ప్రభుత్వం ప్రధాన లక్ష్యం. అన్ని విద్యాసంస్థల్లో యాంటి డ్రగ్స్ కమిటీని నియమిస్తున్నాం. పది మంది విద్యార్థులు ఒక అధ్యాపకుడు ఇందులో ఉంటారు. అలాగే 43 వేల పాఠశాలల్లో 1.30 కోటి మంది విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టింది. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న డీ-అడిక్షన్ సెంటర్లతో కోఆర్డినేషన్ చేసుకుంటున్నాం. వారితో కూడా సమావేశాలు నిర్వహిస్తున్నాం.

● ప్రశ్న: తల్లిదండ్రులకు మీరు ఇచ్చే సూచనలు..

● **ఈగల్ చీఫ్:** తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక నిఘా ఉంచాలి. వారానికి ఒకసారైన వారి పుస్తకాలు, బ్యాగులు తనిఖీలు చేయాలి. ఏదైనా అనుమానం వస్తే ప్రశ్నించాలి. మీ ఇంట్లోకి డ్రగ్స్ రాకూడదనే కృతనిశ్చయంతో ఉండాలి. పిల్లలు ఎక్కడికెక్కడికి వెళ్తున్నారు.. ఒంటరిగా ఉంటున్నారనే విషయాలను కూడా గమనించాలి.



● ప్రశ్న: టోల్‌ఫ్రీ నెంబర్ చెప్పండి

● **ఈగల్ చీఫ్:** ఈగల్ టోల్‌ఫ్రీ నెంబర్ 1972ను ఏర్పాటు చేశాం. ఎవరైనా బాధితులు తమ బాధను ఈ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చు. అలాగే డ్రగ్స్ సరఫరా వంటి వివరాలు వెల్లడించవచ్చు. ఇటీవల ఓ తల్లి 1972కు ఫోన్ చేసి వారి కూతురు డ్రగ్స్‌కు అలవాటు పడిందని సమాచారం ఇవ్వడంతో ఆ అమ్మాయిని డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించేందుకు చర్యలు తీసుకున్నాం.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగట్ల గ్రామంలో తమ్ముడి కుటుంబంపై దాడి చేసిన ఘటనలో అన్న కుటుంబానికి చెందిన నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నల్లగట్లకు చెందిన అన్నదమ్ముళ్లు వెంకట రమణ, నాగరాజుల మధ్య కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదంతో అన్న వెంకటరమణ తన కుటుంబసభ్యులతో కలిసి శనివారం రాత్రి తమ్ముడు నాగరాజు కుటుంబసభ్యులైన హేమలత, మాధవపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. క్షతగాత్రులు నంద్యాలలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఈ ఘటనలో బాధితుడు మాధవ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటరమణ, మల్లేశ్వరి, సాయి, మద్దిలేటి లపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ డ్రింకింగ్ చేసే వారిపై పోలీసులు డ్రోన్‌తో కొరఢా ఝుళిపించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో నాలుగో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేశారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, నాలుగో పట్టణ ఎస్ఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ హుశేన్‌లు శరీన్‌నగర్, వక్కెర వాగు, ఆర్టీసీ బస్టాండు వంటి పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్లు 19 మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు



కర్ణాటక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామికి మెమెంటో ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఆదివారం ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి, ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ న్యాపతి విజయ్, జస్టిస్ మహేశ్వరరావు కుంచెం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తిలు వీరికి ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మఠం సిబ్బంది అనంతపురాణిక్, జేపీ స్వామి, ఎస్ఐ పరమేష్ నాయక్, వ్యాసరాజార్,దేశాయి నరసింహ ఆచార్, ప్రకాష్ ఆచార్,రంగస్వామి, జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పగిడ్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో రామంజనేయులు(35) అనే వ్యక్తి ఆదివారం ఉరి ఆత్మహత్య చేసుకున్నారు. గ్రామానికి చెందిన రామంజనేయులు గ్రామంలో పొలం పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. రామంజనేయులు ఆదివారం ఇంట్లో ఉరివేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు సమాచారాన్ని పోలీస్‌లకు తెలియజేయడంతో ముచ్చుమర్రి ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామంజనేయులు భార్య అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది

మనోహరం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్యాపిలి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1998-99 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో సమావేశమయ్యారు. బెంగుళూరు, హైదరాబాద్ వివిధ ప్రాంతాల్లో, ఆయా వృత్తులలో స్థిరపడిన దాదాపు 70 మందికి పైగా పూర్వ విద్యార్థులు 26సంవత్సరాల తర్వాత కలుసు కోవడంతో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుం టూ పరవసించి పోయారు. అలింగనం చేసుకొని ఆనంద బాష్పాలు రాల్చారు. ఈ మధుర క్షణం తీపిగుర్తుగా స్నేహితులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. అనంతరం చదువు చెప్పిన గురువులకు సన్మానం చేశారు.



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వలస కూలీ ఇంట్లో చోరీ

- ● కూతురు పెళ్లి కోసం దాచిన బంగారం అపహరణ
- ● ఆలస్యంగా వెలుగులోకి..

గోనెగండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని కురువ వీధిలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. గత బుధవారం జరిగిన ఈ ఘటనలో దొంగలు రెండు తులాల బంగారం తీసుకెళ్లారు. వివరాలు ఇలా.. బాధితులు పులకుర్తి రంగస్వామి, ఈరమ్మలు వలస వెళ్లి జీవనం సాగించేవారు. వారికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురుకు పెళ్లి కోసం కూడబెట్టుకున్న డబ్బుతో రెండు తులాల బంగారు కొని ఇంట్లోని బీరువాలో దాచి ఉంచారు. గత నెల 22వ తేదీన తెలంగాణలోని నల్గొండ జిల్లాకు వలసపోయారు. అయితే ఈ నెల ఐదో తేదీన రంగస్వామి అన్న చోరీ తమ్ముని ఇంట్లో చోరీ జరిగిందని తెలుసుకున్నాడు. తమ్ముడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో రంగస్వామి నల్గొండ నుంచి వచ్చి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.



బీరువాను పగల గొట్టిన దొంగలు

చేనేత హస్తకళలను ప్రోత్సహించాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చేనేత హస్తకళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవీ ఫంక్షన్ హాలులో కళాభారతి చేనేత హస్తకళల అభివృద్ధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా మేళాను ఆయన ప్రారంభించారు. మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఆయన పరిశీలించి, ఆయా స్టాళ్ల నిర్వాహకులతో ఉత్పాదక విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ చేనేత, హస్తకళాకారులు తయారు చేసిన వస్త్ర, వస్తు ఉత్పత్తులను కొనుగోలు చేయాలని సూచించారు. పెద్దపెద్ద షోరూమ్‌లలో వీటి విలువ ఎంతో ఎక్కువగా ఉంటుందని, కానీ తయారీదారులే స్వయంగా, స్వల్ప లాభాలతో అమ్ముకోవడం వల్ల ఎలాంటి పన్నులు లేకుండా తక్కువ ధరలకు వస్త్ర, వస్తు ఉత్పత్తులు లభిస్తాయని చెప్పారు. ఈనెల 19 వరకు ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేళా నిర్వాహకులు సత్యనారాయణ, అనిల్, కిషోర్, ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్‌బాషా, కృష్ణ, శ్రీరామ్, హుస్సేన్ పాల్గొన్నారు.

ముగిసిన పరఖ్ రాష్ట్రీయ పరీక్ష



పరీక్ష పత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి, చిత్రంలో సెంట్రల్ అబ్జర్వర్ వీరా ధర్మ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్‌లో భాగంగా జిల్లాలోని 105 పాఠశాలల్లో నిర్వహించిన పరఖ్ రాష్ట్రీయ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరెడ్డి, సెంట్రల్ అబ్జర్వర్ వీరా ధర్మ ఆదివారం తెలిపారు. జిల్లాలో ఈ పరీక్ష నిర్వహించిన పలు కేంద్రాలలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించినట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించడానికి జాతీయ స్థాయిలో ఈ పరీక్ష నిర్వహించామని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్యాముయ్యేల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల విభాగం కన్వీనర్ సంయుక్త డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న బాలికల సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టల్ పరిసరాల్లో విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. ఎస్ఎఫ్ఐ విభాగం మహిళా నాయకులు హాస్టళ్ల పరిశీలనకు వెళితే.. సిబ్బంది, హాస్టల్ వార్డెన్లు అడ్డుకుంటున్నారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. హాస్టల్లో వార్డెన్లు డ్యూటీలు సక్రమంగా నిర్వహించడం లేదని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని అన్నారు. స్నానాలు చేసేందుకు బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మహిళా నాయకులు రేవతి, తులసి, మౌనిక, అక్షయ పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి డిమాండ్ చేశారు. ఆదివారం గీతాముఖర్జీ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న వాటిని భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందని విమర్శించారు. తక్షణమే ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనివాసులు, బీసన్న, నాగరాజు, చంటి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను నగర పాలక వాహనాలకే ఇవ్వాలి

మెడికల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని చికెన్, మాంసపు దుకాణదారులు వ్యర్థాలను నగర పాలక వాహనాలకే ఇవ్వాలని నగర పాలక మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. చికెన్ వ్యర్థాల నిర్వాహణ కోసం టెండర్ వేసేంత వరకు తప్పనిసరిగ్గా నగర పాలక సంస్థ వాహనాలకే వ్యర్థాలను ఇవ్వాలన్నారు. ఇందుకు విరుద్ధంగా వ్యర్థాలను ఎవరైనా ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి షాపు ట్రేడ్ లైసెన్సు రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా వ్యర్థాలను సేకరించిన వాహనాలను కూడా సీజ్ చేస్తామన్నారు. మాంసపు దుకాణదారులు నగర పాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.

రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి




మాట్లాడుతున్న గురుశేఖర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఓ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గతంలో కార్పొరేషన్ ద్వారా నిధులు వచ్చేవని, ప్రస్తుతం రావడంలేదని అన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, రేమట అంజి, వెంకటేశ్వర్లు, రాముడు, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకానికి వీడని గ్రహణం

- నిర్మాణ దశలో నిలిచిన ఓవర్ హెడ్ ట్యాంక్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



గూడూరు డిసెంబరు 8: గూడూరు నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.54కోట్లతో చేపట్టిన తాగునీటి పథకానికి గ్రహణం వీడటం లేదు. నిర్మాణ దశలోనే ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2011లో గూడూరు మేజర్ గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా ఏర్పాటు చేశారు. దాదాపు 30 వేల జనాభాకు శాశ్వత తాగునీటి పరిష్కారం కల్పించేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకానికి రూ.54 కోట్లు మంజూరు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు ముందుకు సాగక పోవడంతో నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సుంకేసుల జలాశయం నుంచి పైపులైను ఏర్పాటు చేసి పట్టణంలోని పడమర బీసీ కాలనీలోని సంప్‌కు నీరు చేర్చాలి. అక్కడ శుద్ధి చేసి నీరు ప్రజలకు సరఫరా చేయాలి. అయితే ఫిల్టర్ బెడ్ పనులు పూర్తి కాలేదు. పట్టణంలోని ఎస్సీ కాలనీ ఒకటి, తిమ్మగురుడు స్వామి ఆలయం సమీపం లో ఒకటి, ప్యాలకుర్తి రహదారిలో ఒకటి మొత్తం మూడు ట్యాంకులు ఒక్కొక్కటి 5లక్షల లీటర్ల సామర్థ్యంతో చేపట్టగా నిర్మాణ దశలో నిలిచిపోయాయి. ఇవి పూర్తయితే ప్రజలకు శాశ్వత తాగునీరు అందుతుంది. అయితే ఆ దిశగా పనులు ముందుకు సాగడం లేదు. ఏళ్ళు గడుస్తున్నా ప్రజలకు తాగునీటి సమస్య తీరడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేయించి పథకం పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



గూడూరు పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలి. మధ్యలోనే నిలిచిపోయిన తాగునీటి పథకాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు శుద్ధజలాన్ని అందించాలి.

\- జె. మోహన్, సీపీఎం మండల కార్యదర్శి, గూడూరు

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



ప్రజల దాహార్తిని తీర్చేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 54 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించగా, వైసీపీ హయాంలో పనులు ముందుకు సాగక పోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈవిషయాన్ని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్ళి నిధులు మంజూరు చేయిస్తాం. తాగునీటి పథకం పనులు పూర్తి చేసి ప్రజలకు శుద్ధజలాన్ని అందిస్తాం.

\- గజేంద్ర గోపాల్ నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు, గూడూరు

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

గౌరు దంపతులు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం గౌరు దంపతుల వివాహ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం టీడీపీ శ్రేణుల సమక్షంలో గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు వీరిని సన్మానించారు. గౌరు దంపతులకు వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పాణ్యం టీడీపీ యువనాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి, కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పాణ్యం మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, దుర్గాప్రసాద్‌రెడ్డి, కొంగనపాడు వినోద్‌కుమార్, యశ్వంత్‌రెడ్డి, న్యాయవాది నాగముని, లక్ష్మీపురం పుల్లారెడ్డి, మహేష్ ఆచారి, పెద్దయ్య, ఈరన్నగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలుంటే అర్జీలు ఇవ్వండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే అర్జీ ఇవ్వాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఒక ప్రకటనలో కోరారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

ఓర్వకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి ఆశాపోగు సూరి మాదిగ, రాష్ట్ర కార్యదర్శి ఆశాపోగు పరమేష్ మాదిగ, గుండమయ్య మాదిగ ఆధ్వర్యంలో ఓర్వకల్లు, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె తదితర గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నన్నూరు ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడిగా మౌలాలి మాదిగ, అధికార ప్రతినిధిగా శివకుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, లొద్దిపల్లె ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా మహేష్ మాదిగ, అధికార ప్రతినిధిగా డి.రాజులను ఎన్నుకున్నారు.



నూతన కమిటీ సభ్యులు

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్ రెడ్డి

ఓర్వకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎమ్మెల్యే గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గౌరు జనార్దన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాల విద్యార్థులకు గౌరు జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, నారాయణ కాలేజీ అధికారి గోవర్ధన్‌రెడ్డిలు ప్లేట్లు, గ్లాసులు, ప్యాంట్లు, పెన్నుల పంపిణీ చేశారు. అలాగే నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గౌరు జనార్దన్ రెడ్డి పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వసతి గృహాల సంక్షేమానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విద్యార్థులకు దాతల సహకారంతో నగదును అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌డబ్ల్యూవో దొరస్వామి, టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, నాయకులు రాంభూపాల్‌రెడ్డి, అన్వర్‌బాషా, ఏసేపు, అల్లాబాబు, అబ్దుల్లా, అయూబ్ బాషా, వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, హెచ్‌డబ్ల్యూవోలు ప్రమీలారాణి, సుంకన్న, శోభన్‌బాబు, వైద్యులు సూర్య, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న గౌరు జనార్దన్ రెడ్డి తదితరులు

భక్తి శ్రద్ధలతో యూత్ క్యాండిల్ లైటింగ్





దైవ సందేశం ఇస్తున్న డాక్టర్ సందీప్ శ్యామ్‌సన్, నృత్యం చేస్తున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి యూత్ క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోల్స్ చర్చి యూత్ ఫెడరేషన్ (సీసీవైఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగరంలోని క్రైస్తవ యువతీ యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్ శ్యామ్‌సన్ దైవ సందేశం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎస్టీబీసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పీహెచ్ మనోరమ అల్బర్ట్ బహుమతులు అందజేశారు. ఇందులో భాగంగా క్వాయర్ బృందం ఆలపించిన దైవభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు ఏడీవి లింకన్, సీసీవైఎఫ్ డైరెక్టర్ ఆర్‌బీ ఎలిజబెత్ భాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ పి.రోహిత్ షెబుయేల్ పాల్గొన్నారు.

ఎస్‌పీజీ క్రైస్తు చర్చిలో.. నగరంలోని ఎస్‌పీజీ క్రైస్తు చర్చిలో ఆదివారం రాత్రి క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్‌ను ఘనంగా నిర్వహించారు. చర్చిలోని సండే స్కూల్, యవ్వనస్తుల విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రెవ. వరప్రసాద్ హాజరై దైవ సందేశమిచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు రవికుమార్, కరుణాకర్, ఎస్‌పీజీ చర్చి కమిటీ సభ్యులు పెర్సీ ఇమ్మానియేల్, రాజారావు, ఆదం, అశోక్‌కుమార్, భాగ్యరాజ్ పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ తాత వేషధారి పిల్లలకు బహుమతులు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఓర్వకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో మండల కార్యదర్శి శ్రీధర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, మండల అధ్యక్షుడు షాజహాన్, భవన నిర్మాణ సంఘం మండల నాయకులు సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఆటో కార్మికులకు బ్యాంకు సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని, మండలంలోని యువతకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా షాజహాన్, కార్యదర్శిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, ధనుంజయుడు, సరళ, సువర్ణ, కమిటీ సభ్యులుగా మద్దయ్య, రాజు, అశోక్, నాగభూషణం, శేఖర్, మహబూబ్ బాషా, నాగభూషణం నాయక్, శోభారాణి, శ్యామలలను ఎన్నుకున్నారు.

'చెరువులను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'



ఆక్రమణకు గురైన చెరువును పరిశీలిస్తున్న పట్టణ పౌర సంఘం నాయకులు

కర్నూలు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులో చెరువులు, భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు నగర శివారురులోని గార్గేయపురం, బి.తాండ్రపాడు వెంకాయపల్లె, నందనపల్లె, భూపాల్‌నగర్, మిలటరి కాలనీలో ఆక్రమణకు గురైన చెరువులు, భూములను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర శివారు ప్రాంతాల్లో రోడ్లు, చెరువులను, వాగులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తుంటే ప్రభుత్వ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి వెంట మహమ్మద్, యూనస్, నాగేంద్ర, మహేష్, వన్నూరు సాహెబ్, అన్వర్ బాషా, వెంకటరమణ, ఎస్ఆర్ గౌడ్, పీటర్ ఉన్నారు.

'శ్రీలక్ష్మి'లో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మి హైస్కూల్‌లో కరాటే మాస్టర్ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టును ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో 30 మంది బాలబాలికలు కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో చక్కటి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముఖ్యఅతిథులుగా డీవీఎం సభ్యులు రమేష్‌బాబు, ఎరుకుల రాజు, రవిశాస్త్రి, ఈశ్వర్ కరాటే బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ రాఘవేంద్ర ఠాగూర్, మహవీర్, శంకర్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.



కరాటే క్రీడాకారులతో అతిథులు

చైర్మన్‌ను నియమించాలి



నూతన కమిటీ ప్రతినిధులతో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.270.61 కోట్లు నిధులు కేటాయించడం హర్షణీయమని, అయితే కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ కోరారు. ఆదివారం నగరంలోని సంకల్‌బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో నగర బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు ఉప కార్యదర్శులను, ఒక సంయుక్త కార్యదర్శిని సంఘ కమిటీలో నియమించారు. ఈ సందర్భంగా సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేద బ్రాహ్మణులకు టిడ్కో ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, రేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. సంఘం చేసిన వివిధ తీర్మానాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, గౌరవ సలహాదారు టి. రవిచంద్రశర్మ పాల్గొన్నారు.

విద్యార్థి దశలో తైక్వాండో తప్పనిసరి



తైక్వాండో క్రీడాకారులతో కోచ్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంసీ పార్కు కాంప్లెక్స్‌లో ఆదివారం ఉచిత తైక్వాండో శిక్షకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శిక్షణా కేంద్రాన్ని న్యాయవాది శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ టి.వెంకటేశ్వర్లు, తైక్వాండో శిక్షకులు అజయ్ నందిని, అశ్విని, లలిత, మల్లేష్, హరికృష్ణ, విశ్వాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం సరికాదు



మాట్లాడుతున్న శ్రీనివాస్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయిబాబాపై దుష్ప్రచారం సరికాదని ఏపీ షిరిడీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు జి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి. హరిహరరావు అన్నారు. ఆదివారం నగరంలో చిదంబరరావు వీధిలోని అఖిల భారత కరివేన బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం సమావేశ హాలులో విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు. కాశీలో సాయిబాబా విగ్రహాలు తొలగించడం, బాబా జీవిత చరిత్ర గ్రంథాలను మార్పు చేసే ప్రయత్నం చేయడం వంటి చర్యలను ఏపీ షిరిడీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించి షిరిడీ సాయిబాబాపై జరిగే దుష్ప్రచారం అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు ఆకతాయిలు సాయిబాబాపై దుష్ప్రచారం చేస్తూ మత విద్వేషాలు పెరిగే విధంగా ప్రవర్తించడం బాబా భక్తులను తీవ్రంగా మనోవేదనకు గురి చేస్తోందని అన్నారు. ఈ సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు కర్లపూడి కృష్ణ, మధుసాయి, కోశాధికారి రబీన కుమార్, ఇతర ప్రతినిధులు ఆదిపూడి సాయిరామ్, బాలాజీ, వరప్రసాద్, నాగభూషణం శర్మ, మహా బలేష్, బ్రాహ్మణ సంఘం నాయకులు హెచ్‌కే మనోహర్ రావు, హెచ్‌కే రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

రచ్చకట్ట పంచాయితీ నిర్వహిస్తే చర్యలు: సీఐ

సి.బెళగల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో రచ్చకట్ట పంచాయితీ నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని కోడుమూరు సీఐ తబ్రేజ్ హెచ్చరించారు. ఆదివారం బురాన్‌దొడ్డి, మారందొడ్డి, పోలకల్లు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోదీతోనే రాష్ట్రానికి విద్యా సంస్థలు

ఆదోని టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి మోదీ చొరవతోనే రాష్ట్రానికి 8 కేంద్రీయ విద్యాలయాలు కేటాయించారని బీజేపీ ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మాట్లాడుతూ ఇటీవల తిరుపతికి ఐఐటీ మంజూరు చేయడంతో మొత్తం మొత్తం 9 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటవుతున్నాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్‌కు ఒక కేంద్రీయ విద్యాలయం ముంజూరు కావడంతో జిల్లా అభివృద్ధికి అవకాశం కలిగిందన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


కబడ్డీ క్రీడాకారులతో టీడీపీ నాయకులు

తుగ్గలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సర్పంచ్ ఓబులేసు, విద్యాకమిటీ ఛైర్మన్ రవి, మిద్దె వెంకటేశ్ యాదవ్, బాలన్న అన్నారు. ఆదివారం జొన్నగిరిలో కబడ్డీ క్రీడాకారులకు విద్యాకమిటీ ఛైర్మన్ రవి యాదవ్ సొంత ఖర్చులతో క్రీడాదుస్తులు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు వారికి ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలన్నారు. క్రీడలకు టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. మీసాల శేఖర్, జయరాం, హెడ్ కానిస్టేబుల్ జయన్న ఉన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

ఆలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఆలూరు ఈవోఆర్డీ ప్రభాకర్ రావ్ కోరారు. ఆదివారం మాట్లాడుతూ ఖాళీ స్థలం ఉంటే వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, బహిరంగ మాల విసర్జన చేయకూడదన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

మద్దికెర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో పాటు నైతిక విలువలను అలవరచుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం మద్దమ్మకుంట గ్రామం సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు విజయప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, టీడీపీ నాయకులు ఎర్రిస్వామి, రమేష్, మల్లికార్జున, సుగ్గలప్ప, సోము, ప్రకాష్, మండల ఎస్సీ సెల్ నాయకులు పారా రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

దేవనకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు వీరమ్మ (65) మృతి చెందడంతో అంత్యక్రియలకు టీడీపీ నాయకులు రూ.5 వేలు అందజేశారు. వీరమ్మ టీడీపీ సభ్యత్వం తీసుకుందన్నారు. ఆకుల వీరేష్, మాల బండ్లయ్య, మస్తాన్, రాజాసాబ్, మసీద్‌రాముడు, తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయండి

ఆదోని టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైందవ శంఖరావాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సాకరే ఈరన్న రావు పిలుపునిచ్చారు. ఆదివారం గోడ పత్రికలు, కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 11వ తేదీన బైకు ర్యాలీ ఉంటుందని, రాత్రి 7 గంటలకు పట్టణంలోని అన్ని ఆలయాల్లో సామూహిక హారతి ఉంటుందన్నారు. కోశాధికారి కొంగేపంపాపతి, ఆర్‌ఎస్ఎస్ తరపున మంతా బుగ్గా రమేష్, శేషరెడ్డి, రఘునాథ్ పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ప్రగతి

మద్దికెర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందని మాజీ సర్పంచ్ బసినేపల్లి ప్రతాప్ అన్నారు. ఆదివారం బసినేపల్లి గ్రామంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలో అభివృద్ధి కనిపిస్తుందన్నారు. వైసీపీకి రాజీనామ చేసి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరతామన్నారు. తనతో పాటు విద్యాకమిటి ఛైర్మన్లు, మాజీ ప్రతిప్రతినిధులు సిద్ధంగా ఉన్నామన్నారు. వైసీపీ హయాంలో అన్ని రంగాల వారికి అన్యాయం జరిగిందన్నారు.


హెచ్‌ఎంలను నియమించాలి: ఎస్టీయూ



మాట్లాడుతున్న ఎస్టీయూ సీనియర్ నాయకుడు సత్యన్న

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆదర్శ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలను నియమించాలని ఎస్టీయూ నాయకుడు సత్యన్న, రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు మహాదేవప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని, కౌతాళం మండలాల ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మోడల్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అపార్ నమోదులో ఉన్న ఇబ్బందులను సరిదిద్ది పాఠశాల ఆవరణలోనే మొబైల్ ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, బకాయిలను చెల్లించాలన్నారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, కార్యదర్శి గోపాల్, రామాంజినేయులు, సుధాకర్, షేక్షావలి, ఆంజనేయ, భాస్కర్ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచండి


ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పను వసూళ్లల్లో వేగం పెంచాలని కమిషనర్ కృష్ణ మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లను మున్సిపల్ కమిషనర్ క్రిష్ణ ఆదివారం పర్యవేక్షించారు. వసూళ్లు నెమ్మదించడంతో స్వయంగా సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. 50శాతం కూడా వసూలు కాకపోవడంతో స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు.

పూర్తయ్యేదెప్పుడు?

- ఆదోనిలో నిలిచిపోయిన మెగా కాంప్లెక్స్ నిర్మాణం
- దుకాణాలకు ఇప్పటికే డబ్బు చెల్లించిన వ్యాపారులు


పునాదులకే పరిమితమైన పనులు

ఆదోని టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బస్టాండ్, రిక్రియేషన్ క్లబ్ స్థలంలో గుడ్‌విల్ పద్ధతిన మెగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రభుత్వ సంకల్పం. దీంతో పురపాలక సంఘానికి ఆదాయం కూడా సమకూరుతుంది.

డీపీఆర్ (డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్)ను గతేడాది మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. దాదాపు 2.5 ఎకరాల స్థలంలో గుడ్ విల్ పద్ధతిలో రూ.33కోట్ల అంచనాతో రూపొందించారు. గత వైసీపీ హయాంలో 2022లో నాటి ఎమ్మెల్యే సాయి ప్రసాదరెడ్డి పనులు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం మారాక పనులు ఆగిపోయాయి.

గుడ్‌విల్ పద్ధతిలో నిర్మాణం

ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి అంచనా రూ.33 కోట్లు. మూడు అంతస్తులలో మొత్తం 392 దుకాణాలు నిర్మించాల్సి ఉంది. కాగా గుడ్‌విల్ పద్ధతిలో నిర్మించనున్నారు. వేలంలో దక్కిం చుకున్న వారు దుకాణానికి వేలం పాడిన మొత్తంలో 25శాతం ముందే చెల్లించాలి. కాగా దక్కించుకున్న 24మంది వ్యాపారులు మొత్తాన్ని కూడా చెల్లించారు.

నిలిచిపోయిన పనులు

జరిగే మూడు బ్లాక్‌లతో కూడిన భారీ కమర్షియల్ కాంప్లెక్స్‌లో మొత్తం 392 దుకాణాలను నిర్మించడానికి రూపొందించిన మొదటి విడతలో నిర్మించే గ్రౌండ్ ఫ్లోర్ షాపులకు వేసిన వేలంపాటలో 24 మంది వ్యాపారులు రూ.7.74 కోట్లకు 24 దుకాణాలను కైవసం చేసుకొన్నారు. వారు రూ.1.93 కోట్లను ఇప్పటికే చెల్లించారు. పనులు ముందుకు సాగేకొద్దీ నాలుగు విడతల్లో మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది.

రూ.4 కోట్ల ఆదాయం

వ్యాపార సముదాయం మొత్తం 329 దుకాణాలు పూర్తయితే ఏడాదికి రూ.4కోట్ల మేర ఆదాయం సమకూరే అవకాశముంది. సమయం గడిచే కొద్దీ నిర్మాణ వ్యయం పెరిగే అవకాశముండటంతో సందిగ్ధం కినిపిస్తోంది.

ప్రభుత్వానికి నివేదించాం



మెగా కాంప్లెక్స్‌ను ప్రభుత్వ నిధులతో కాకుండా, గుడ్‌విల్ పద్ధతిలో నిర్మిస్తున్నాం. పనులను కొనసాగించడానికి అనుమతి ఇవ్వాలని ఆర్థిక శాకకు నివేదించాం. అనుమతి లభించాక పనులను ప్రారంభిస్తాం.

- కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

పునాదులతోనే ఆగిన పనులు

ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం మారడంతో నిర్మాణం పనులు హఠాత్తుగా స్థంభించి పోయాయి. ఆరు నెలలు గడిచినా ప్రారంభం కాకపో వడంతో డబ్బు చెల్లించిన వ్యాపారులు బేంబేలెత్తిపో తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకు 25 శాతం కంటే తక్కువగా చేసిన, నాబార్డ్, ఈఏపీ, సీఎస్ఎస్‌కు చెందిన పనులు మినహా మిగతావి నిలిపివేస్తూ ప్రభుత్వ ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించి, కాంప్లెక్స్‌ను పూర్తి చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు

హొళగుంద, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరగట్టు మాల మల్లేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పూజారులు జయ మల్లప్ప స్వామి, మల్లికార్జున స్వామి ఆదివారం తెలిపారు. తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలైనా మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రాభిషేకం నిర్వహించామన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక ఆంధ్ర కర్ణాటక భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారని తెలిపారు. పూజల అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా దస్తగిరయ్య ఉరుసు

తుగ్గలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి గ్రామంలో దస్తగియ్య ఉరుసు ఆదివారం నిర్వహించారు. హజరత్ సయ్యద్ దస్తగిరి ఉరుసు ఉత్సవాల సందర్భంగా భక్తులు దర్గాకు వెళ్లి ప్రత్యేక పూజలతో పాటు ప్రార్థనలు చేసి కోర్కెల మేరకు కానుకలు సమర్పిం చుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మహిళలకు గాజుల అంగళ్లు, మిఠాయిల దుకాణాలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేయడంతో పండుగ వాతావరణం కనిపించింది. నేడు ఊరేగంపు నిర్వహి స్తామని నిర్వాహకులు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో మున్సిపల్, నెహ్రూ మెరియల్, ప్రభుత్వ బాలికల పాఠశాలతోపాటు మరో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష పాస్ అయితే ఐదేళ్లపాటు ఏటా రూ.12 వేల ఉపకార వేతనాన్ని కేంద్ర ప్రభుత్వం అందించనుంది. డిప్యూటీ ఈవో వెంకట రమణారెడ్డి తనిఖీ చేశారు. 2,208 విద్యార్థులకు గాను 92 మంది విద్యార్థులు గైరాజరైనట్లు ఆయన తెలిపారు.


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో

చినుకు పడితే చిత్తడే

ఆస్పరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొహరాపురం గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. బ్రహ్మయ్య గుడి, ఈశ్వర స్వామి కట్ట, ఎస్సీ బీసీ కాలనీల్లో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఇటీవల నలుగురు వృద్ధులు కాలు జారీ కింద పడిపోయినట్లు గ్రామస్తులు వాపోయారు. సర్పంచ్, అధికారులకు విన్నవించినా పంట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.


జొహరాపురం బురద రోడ్డుపై ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

మూగజీవాలకు వైరస్


హొళగుందలో వైరస్ బారిన పడిన ఆవు

హొళగుంద, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూగ జీవాలపై లంపి వైరస్ పంజా విసురుతోంది. దీంతో పశువులు మృత్యువాత పడుతున్నట్లు నాగరకన్వి గ్రామానికి చెందిన పాడి రైతు గంగాదర్ వాపోయారు. శరీరం నిండా దద్దుర్లు ఏర్పడి ఆవులు, ఎద్దులు నరకయాతన అనుభవిస్తున్నాయన్నారు. పాలిచ్చే ఆవులు కొన్ని ఇప్పటికే చనిపోయాయని తెలిపారు. దీంతో పాల ఉత్పత్తి తగ్గిపోతోందన్నారు. పశువైద్యులు వైద్యం చేసి, మూగజీవాలను కాపాడాలని కోరుతున్నారు.

భయపెడుతున్న విష సర్పాలు


చంపేసిన పామును చూపుతున్న వ్యక్తి

ఆలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యా సంస్థలు, హాస్టళ్ల వద్ద వద్ద పాముల సంచారం అధికంగా ఉంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హడలిపోతున్నారు. ఎమ్మార్సీ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ సమీపంలో వారంలో రెండు పాములను గుర్తించి చంపేశారు. అలాగే గత వారం మోడల్ స్కూల్ హాస్టల్ వద్ద పెద్ద పామును గుర్తించి చంపివేశారు. ఆదివారం ఎమ్మార్సీ వద్ద పామును చంపేశారు. చుట్టూ పిచ్చిమొక్కలు ఉండటంతోనే పాములు వస్తున్నాయని, వాటిని తొలగించి పిల్లలకు రక్షణ కల్పించాలని తల్లి దండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి

తుగ్గలి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లింగాయత్‌ల అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ వీరశైవ లింగాయత్‌ల సాధికారిక కమిటీ సభ్యుడు బాదడ కౌశిక్ కుమార్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. టీడీపీ గెలుపుకు లింగాయత్‌లు కృషి చేశారని, ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షలకు పైగా లింగాయత్‌లు ఉన్నారనీ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు శ్రీశైలం ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవి వీరశైవ తమకే వ్వాలని కోరారు. వెనుకబడిన వారిని ఆదుకోవాలని కోరారు.

వైభవంగా కల్యాణం

మద్దికెర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంట సుబ్రహ్మన్యస్వామి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం షష్టి ఉత్సవాల సందర్భంగా వేకువజామున పురోహితులు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం, పల్లకీ సేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. పత్తికొండ న్యాయా . దికారి భారతి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ దర్శించుకున్నారు.

గోతులను పూడ్చాలి

ఆదోని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులపై ఉన్న గోతులను పూడ్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం లింగన్న, రామాంజనేయులు, హనీఫ్, మోహన్‌రెడ్డి, పాండవగల్లు వద్ద రహదారిపై నిరసన తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వృద్ధులు, మహిళలకు ఆదివారం రాత్రి ఏపీయుడబ్ల్యూజే అధ్యక్షుడు హనీఫ్‌భాషా కుమారులు హర్షద్, హర్షణ్ దుప్పట్లు, స్వెట్టర్లను పంపిణీ చేశారు. చిన్నారులు మాట్లాడుతూ తాము పోగు చేసుకున్న నగదుతో, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు నరసింహనాయుడు చేతుల మీదుగా అందజేసినట్లు వారు తెలిపారు. చిన్నారులు సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమని నరసింహ నాయుడు వారిని అభినందించారు.

బైకు అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదార్‌పురం గ్రామ సమీపంలో జాతీయరహదారిపై బైకు అదుపుతప్పడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. రాజశేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తులు కర్నూలుకు బైకుపై వెళుతుండగా బైకు అదుపు తప్పింది. ఇద్దరు గాయపడటతో స్థానికులు 108లో కర్నూలుకు తరలించారు.

కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

ఆలూరు రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలో బళ్లారి రోడ్డు వద్ద ఆదివారం కారు ఢీకొట్టి ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. కురవళ్లికి చెందిన మంజునాథ్, శేకన్న ఆలూరులో పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా ఆదోని నుంచి బళ్లారికి వెళ్తున్న కారు ఢీ కొట్టింది. క్షతగాత్రులను ఆలూరులో ప్రథమ చికిత్స అనంతరం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఆదోని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తిమ్మప్ప ఆలయంలో పూజలు చేసేక్రమంలో గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, కాశీం కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఘర్షణకు దారితీసింది. ఆరుగురు గాయపడగా, ఆదోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

- కుడా ఛైర్మన్‌కు వీరభద్ర గౌడ్ వినతి

అభివృద్ధికి సహకరించండి



సోమిశెట్టికి బొకే ఇస్తున్నవీరభద్ర గౌడ్

ఆలూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆలూరు అభివృద్ధికి సహకరించాలని కుడా ఛైర్మన్ సోమిశెట్టిని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ కోరారు. ఆదివారం కర్నూలు టీడీపీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపానన్నారు. నియోజ కవర్గంలో సభ్యత్వ నమోదుపై చర్చించినట్లు తెలిపారు.


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వైద్య శిబిరంలో పరీక్షలు

ఆదోని రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పెద్దతుంబళం గ్రామంలో వైద్యులు దాదాపు 70 మంది రోగులను పరీక్షించి, చికిత్స అందించారు. వీరిలో 27 మందికి కంటి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని వైద్యులు సైపుల్లా, రాఘవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, హుసేన్, జీవన్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.20వేల సాయం

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ బాధితురాలైన స్నేహితురాలికి రూ.20వేలు అందజేశారు. పట్టణానికి చెందిన తంబల రాజేశ్వరి రెండు కిడ్నీలు చెడిపోయి, తీవ్ర అనారోగ్యానికి గురైంది. విషయం తెలుసుకున్న 1988-89 బ్యాచ్ స్నేహితులు నరసింహరాయుడు, శ్యామల, సువర్ణ, భారతి, షేక్షావలి, బ్రహ్మానం దరెడ్డి, బషీర్ అహ్మద్, పామయ్య యాదవ్, జయన్న ఆచారి, ఖలీల్ బాషా, హరినాథ్, మల్లికార్జునరెడ్డి, పెద్ద రజాక్ ఆమె గృహానికి వెళ్లి పరామర్శించారు.

ప్రమాదం జరిగే వరకు స్పందించరా?

- ఆదోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ దుస్థితిపై స్పందించని అధికారులు


శిథిలావస్థలో ఎస్సీ హాస్టల్ భవనం

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలో ఉన్న ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉంది. ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గోడలు నెర్రలు ఏర్పడి, పైకప్పు పెచ్చులూడుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవటంతో రాత్రిళ్లు ఆరుబయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. చుట్టూ పొలాలు కావడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ హాస్టల్‌ను ఎమ్మిగ నూరు సర్కిల్ కర్రెప్ప హాస్టల్ భవనంలోకి మారుస్తామని చెప్పిన అధికారులు కాలయాపన చేస్తున్నారని వాపోతున్నారు. ప్రమాదం జరిగితే తప్ప స్పందించరా అంటూ విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు.

బాధితులు స్వేచ్ఛగా ఫిర్యాదు చేయండి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆస్పరి సీఐ మస్తాన్ వలి



ఆస్పరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బాధితులు స్వేచ్ఛగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సీఐ మస్తాన్ వలి అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: పోలీస్ స్టేషన్‌లో బాధితులు, నిందితులు ఇరువైపుల నుంచి డబ్బులు తీసుకుని పంచాయితీ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: అలాంటిది ఏమీ లేదు. కేవలం చట్టపరమైన చర్యలు మాత్రమే తీసుకుంటాం.

ప్రశ్న: ఇసుక రవాణా ఎలా?

జవాబు: మండలంలో ఇసుక రీచ్‌లు ఎక్కడా లేవు. అయితే తహసీల్దార్, వీఆర్వో ఉత్తర్వులతో వంకలు, వాగులు, చెరువుల్లోని ఇసుకను రవాణా చేసుకోవచ్చు.

ప్రశ్న: మండలంలో మట్కా జోరుగా సాగుతోందని ఆరోపణలు ఉన్నాయి. పల్లెల్లో పేకాటరాయుళ్లపై కేసులు నమోదు చేశారా?

జవాబు: మండలంలో మట్కా, పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేసి చర్యలు తీసుకున్నాం. కేసులు నమోదు చేశాం.

ప్రశ్న: మండలంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయి?

జవాబు: మండలంలో 33 గ్రామాలు ఉన్నాయి. నేను బాధ్యతలు తీసుకున్న అనంతరం శాంతి భద్రతలు బాగున్నాయి. బాధితులు ఏ క్షణమైనా నేరుగా నన్ను సంప్రదించవచ్చు.

నాలుగో రోజుకు చేరిన కార్మికుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సంఘం అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఆదివారం నాలుగో రోజు సమ్మె చేపట్టారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ నుంచి శివ సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ఎదుట సమ్మెకు దిగారు. సంఘం అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామ కృష్ణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఇంజనీరింగ్ సెక్షన్‌లో వివిధ భాగాలలో పని చేస్తూ చాలీచాలని జీతాలతో, పెరిగిన ధరలతో జీవనం సాగించడం కష్టతరమైందన్నారు. కనీస వేతనం, ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని, 15సంవత్సరాల సర్వీస్ కలిగిన వారిని పర్మినెంట్ చేయాలని, మరణించిన కార్మికునికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే అన్ని విభాగాలను కలుపుకొని పూర్తిగా విధులకు దూరంగా ఉంటూ ఉద్యమాన్ని తీవ్రత చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజి, పంపాపతి, సాయి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల రద్దీ



శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. అశేషమైన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి భక్తులు తరలివచ్చారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖ ద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు ఆచరించి గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని మఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొన్న మఠం అధికారులు క్యూలైన్లు,పరిమళ ప్రసాదం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

అలరించిన రేలారే రేలా

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడబండ గ్రామంలో కార్తీక పూజలను పురస్కరించుకొని ఆదివారం జరిగిన రేలారేరేలా కార్యక్రమం గ్రామస్థులను అలరించింది. రేలారేరేలా మూడో దరువు విన్నర బేతంచర్ల గోపాల్, శ్రీదేవి డ్రామా కంపెని గాయకురాలు జానకి, సారంగధరియా విన్నర్ సూరితో పాటు పలువురు కళాకారులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



జాహ్నవికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కరస్పాండెంట్ వాసుబాబు

ఎమ్మిగనూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన బోడబండ జగదీష్ కుమార్తె జాహ్నవి సెపక్ తాక్ర జాతీయ స్థాయి పోటీల్లో ఆడేందుకు ఎంపికైంది. జాహ్నవి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఇటీవల నంద్యాల జిల్లా నందికొట్కూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచింది. ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైంది. జాతీయ స్థాయిలో ఆడేందుకు జాహ్నవి ఎంపిక కావటం పట్ల బాలిక తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

ఏపీఎం, బుక్ కీపర్‌పై చర్యలు తీసుకోవాలి



పురుషోత్తంరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కడిదొడ్డి ఈరమ్మ

కోసిగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో పని చేస్తున్న ఏపీఎం సత్యమ్మ, కందుకూరు బుక్ కీపర్ రుద్రమ్మపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకురాలు కడిదొడ్డి ఈరమ్మ కోరారు. గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వంలో భాగ్యలక్ష్మి గ్రూపులో బీజేపీ సానుభూతిపరులు అని చెప్పి ఐదు మందిని, రంగస్వామి పొదుపు గ్రూపులో ఒకరిని మొత్తం ఆరుగురిని పొదుపు గ్రూపుల నుంచి తొలగించారన్నారు. తాము కట్టిన రూ.2.85 లక్షలు పొదుపు డబ్బులు ఇవ్వలేదన్నారు. ఏపీఎం సత్యమ్మ, కందుకూరు బుక్ కీపర్ రుద్రమ్మ, అప్పటి నాయకుల మాటలు విని మమ్మల్ని పొదుపు సంఘం నుంచి తొలగించారన్నారు. తమకు న్యాయం చేయాలని రాతపూర్వకంగా పురుషోత్తంరెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కడిదొడ్డిగ్రామానికి చెందిన పొదుపు సంఘం సభ్యులు ఉన్నారు.

గోశాలకు రూ.1.25 లక్షలు విరాళం

మంత్రాలయం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటకలోని బాగల్‌కోటకు చెందిన బసవన్న గౌడ అనే భక్తుడు రూ.1.25 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, గిరిధర్, శ్రీపాద ఆచార్, మోహన్‌రావు కులకర్ణి పాల్గొన్నారు.

పేరుకే నియోజకవర్గం

మంత్రాలయానికి కార్యాలయాల కొరత ● ఎమ్మిగనూరు నుంచే అధికారులు



మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్

మంత్రాలయం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి క్షేత్రం వెలసిన మంత్రాలయం నియోజకవర్గ కేంద్రం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏవి కనిపించవు. ఇప్పటికీ కార్యాలయాలన్నీ ఎమ్మిగనూరు, ఆదోనిలోనే కొనసాగుతున్నాయి. పట్టించుకోవాల్సిన పాలకులు, ఉన్నతాధికారులు తమకు ఏమిపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో మంత్రాలయం నియోజకవర్గం కేంద్రమైనప్పటికీ మండల కేంద్రంగానే కొనసాగుతోంది. జనాభా ప్రాతిపదికన 2009లో మంత్రాలయం కొత్త నియోజకవర్గంగా ఏర్పడింది. అంతకుముందు మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఉండేవి. కౌతాళం మాత్రం ఆదోని నియోజకవర్గంలో ఉండేది. 2009 పునర్విభజనలో భాగంగా కౌతాళం, మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు, నాలుగు మండలాలను కలిపి మంత్రాలయం నియోజకవర్గంగా ఏర్పాటు చేసినప్పటికీ ఆ స్థాయిలో ఉండాల్సిన కార్యాలయాలు, వసతులు కనిపించడం లేదు. కేవలం మండలంలో ఎలాంటి వసతులు, కార్యాలయాలు ఉన్నాయో అలాగే కొనసాగుతున్నాయి.



పాత పాఠశాల భవనంలో కొనసాగుతున్న ఐసీడీఎస్ కార్యాలయం

నియోజకవర్గంలో ఉండాల్సిన కార్యాలయాలు : మంత్రాలయం నియోజకవర్గంలో 2,08,471 మంది ఓటర్లు ఉన్నారు. ఇంత పెద్ద నియోజకవర్గంలో కేవలం రాఘవేంద్రస్వామి మఠం ఉండటంతోనే మంత్రాలయంగా ప్రసిద్ధి చెందింది గానీ.. కార్యాలయాలు, అధికారులకు ఎటువంటి వసతులు కల్పించకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి ఉందనే చెప్పవచ్చు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, అగ్నిమాపక కేంద్రం, పంచాయతీరాజ్, సీడీపీవో కార్యాలయం, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, రిజిస్ట్రేషన్, విద్యుత్, బాలికల వసతి గృహం, డిగ్రీ కళాశాల, ఎక్సైజ్ శాఖ హెడ్ పోస్టాఫీసు, ఆర్టీసీ బస్సు డిపో, 50 పడకల ఆసుపత్రి, మేజిస్ట్రేట్ కోర్టు, గృహ నిర్మాణం తదితర కార్యాలయాలు నియోజకవర్గం హెడ్ క్వార్టర్‌లో ఉంటూ డీఈ అధికారి పర్యవేక్షణలో నియోజకవర్గ ఏఈలుగా ఉంటూ పర్యవేక్షించాల్సి ఉంది. అయితే.. ఇన్ని కార్యాలయాల్లో ఉన్నవి మాత్రం ఒకటి సీడీపీవో కార్యాలయం, విద్యుత్, గృహ నిర్మాణం ఈ మూడు కార్యాలయాలు మాత్రమే మంత్రాలయంలో కొనసాగుతున్నాయి. మిగతా 14శాఖలు ఎమ్మిగనూరు, ఆదోనిలో కేంద్రాలుగా డీఈలు అక్కడే కొనసాగుతూ ఈ నాలుగు మండలాల ప్రజలు అవసరమైతే ఆదోని, ఎమ్మిగనూరు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పంచాయతీరాజ్ శాఖ మంత్రాలయం పేరు మీదుగా ఆదోనిలో కొనసాగుతుంది. వ్యవసాయ శాఖ ఎమ్మిగనూరులో మంత్రాలయంలో రెండు మండలాలు ఆదోనిలో రెండు మండలాలు వేరు చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరా సంబంధించి ఎమ్మిగనూరులో కొనసాగుతుంది. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖలు సెక్షన్ల వారిగా నిర్వహిస్తున్నారు. రిజిస్ట్రేషన్ మాత్రం కోసిగి కేంద్రంగా రెండు మండలాలకు, మిగతా రెండు మండలాలు ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో చేయించుకోవాల్సి ఉంది. ఎక్సైజ్ శాఖ కోసిగి, పెద్దకడుబూరులో ఉండగా.. మంత్రాలయం ఎమ్మిగనూరులోకి, కౌతాళం ఆదోనిలో ఉంటున్నాయి. హెడ్ పోస్టాఫీసు, ఆర్టీసీ బస్సు డిపో, మేజిస్ట్రేట్ కోర్టు ఎమ్మిగనూరులో కొనసాగుతున్నాయి. కనీసం చికిత్స కోసం ఆసుపత్రిలో ఒక రోగులకు చికిత్స అందించే పరిస్థితి లేదు. ప్రస్తుతం సీడీపీవో, విద్యుత్, గృహ నిర్మాణం భవనాలు తాత్కాలిక భవనాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. పేరు గొప్ప.. కార్యాలయాలు మాత్రం నిల్‌గా కొనసాగుతుంది. ఏ అధికారి వచ్చినా మంత్రాలయంలో స్థానికంగా ఉండే అధికారి లేకపోవడంతో మండల కేంద్రంగా మౌలిక సదుపాయాలు, కార్యాలయాలతోనే 16 ఏళ్లుగా నెట్టుకువస్తుంది. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా బాలనాగిరెడ్డి ఇక్కడ కార్యాలయాలు నెలకొల్పాలన్న ఆలోచనే రాకపోవడం గమనార్హం. ప్రభుత్వాలు మారినా మంత్రాలయం నియోజకవర్గంపై పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి పెట్టకపోవడంతో మంత్రాలయం నియోజకవర్గానికి శాపంగా మారింది.

● **స్థలాల కొరత:** మంత్రాలయంలోని రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన భూములు అధికంగా ఉన్నాయి. వీటిలో ప్రైవేటు స్థలాలు తక్కువగా ఉండటం, కార్యాలయాలు నెలకొల్పేందుకు ఇబ్బందులు తలెత్తాయి. ఉన్న పోలీస్ స్టేషన్, ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలన్నింటికి ఖాళీ చేయాలని శ్రీమఠం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎప్పుడు ఈ కార్యాలయాలు ఉంటాయో, ఉండవో అధికారులకే తెలియాల్సి ఉంది.

వైసీపీకి భారీ షాక్

● కుంబళనూరు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు టీడీపీలో చేరిక
● సాదరంగా ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కౌతాళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలినది. మండల పరిధిలోని కుంబళనూరు గ్రామానికి చెందిన సర్పంచ్ వీరేష్, ఎంపీటీసీ ముత్తన్నతో పాటు గ్రామ వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు సుమారు 80 మంది ఆదివారం వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మిగనూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి స్వగృహంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి తిక్కారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కుంబళనూరు గ్రామ సర్పంచ్ వీరేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీలర్ ఈరన్నగౌడ్, ముదేగౌడ, మహదేవప్ప, వడ్డే దుర్గప్ప, మాల రామచంద్ర, ఎరుకలి బసవ, మాల వెంకటేష్ ఉన్నారు.



టీడీపీలో చేరిన వారితో తిక్కారెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు

ఎస్ఐ శ్రీనివాసులు

నందవరం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏ గ్రామంలోనైనా బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివా రం ఎస్ఐ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: బెల్టు షాపులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: గ్రామాల్లో అక్రమంగా మద్యం తెచ్చినా.. బెల్టు షాపులు నిర్వహించిన చర్యలు తప్పవన్నారు. కొన్ని గ్రామాల్లో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. గ్రామాల్లో ఎవరైనా బెల్టు షాపులు నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకు వస్తే సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

ప్రశ్న: శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయి. గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలి.

ప్రశ్న: మండలంలో పేకాట, మట్కా రాయుళ్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మండలంలో మట్కా అయితే ఎక్కడ జరగడంలేదు. పేకాట రాయుళ్లు అక్కడక్కడ ఉన్నారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇటీవల దాడులు చేసి కేసులు కూడా నమోదు చేశాం.

ప్రశ్న: మండలంలో క్రైం రేట్ ఎలా ఉంది?

జవాబు: ప్రస్తుతం క్రైం రేట్ అదుపులో ఉంది. గ్రామాల్లో ప్రజలకు అక్షర జ్ఞానం పెరిగింది. తమ పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించి ఉద్యోగస్తులను చేయాలని భావిస్తున్నారు. దీంతో ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా గొడవలకు దూరంగా ఉన్నారు.

ప్రశ్న: గ్రామాల్లో నైట్ బీట్ ఏర్పాటు చేస్తున్నారా?

జవాబు: సమస్యాత్మక గ్రామాల్లో నైట్‌బీట్ ఏర్పాటు చేస్తున్నాం. రాత్రి పూట కూడా పోలీసులు వీధుల్లో తిరుగుతున్నారు. అనుమానితులను విచారించి తగు చర్యలు తీసుకుంటున్నాం.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● ఎంవీఎస్, జలజీవన్ మిషన్, పీడబ్ల్యూఎస్ స్కీంలకు మోక్షం
● మండలంలోని 28 గ్రామాలకు తీరనున్న దాహార్తి

గోనెగండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండలంలోని 28 గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య తీరనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకుగాను ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద రూ. 34 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఈ నిధులలోనే గోనెగండ్ల జలజీవన్ మిషన్‌కు గాను గతంలో మంజూరైన రూ. 2.50 కోట్లకు అదనంగా మరోరూ. 1.1కోట్లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన టెండర్ పనులు పూర్తి అయ్యాయని రెండు రోజులలో పనులు ప్రారంభమవుతాయని అన్నారు. అలాగే మండలంలోని 14 గ్రామాలకు గాను గతంలో ఎంవీఎస్ స్కీం పనులు కూడా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. తిప్పనూరు, కున్నూరు, గుల్లమోరుసు, ఐరన్‌బండ, అయ్యకొండ, ఎన్నెకండ్ల గ్రామాలలో పనులు పూర్తయ్యాయని పెద్దనేలటూరు గ్రామంతో పాటు మరో రెండు గ్రామాలలో పనుల నిలిచిపోగా మిగతా గ్రామాలలో పనులు కొనసాగుతున్నాయన్నారు. మిగితా గ్రామాలలో పైప్‌లైన్, మోటార్, ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి ఇచ్చేందుకు గాను ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. మండలంలోని అన్ని పనులకు కలిపి రూ. 34 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నిధులతో పనులు ప్రారంభించి తాగునీటి సమస్యను తీర్చునున్నట్లు ఆయన తెలిపారు.

రాఘవరాయుడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. ఆదివారం సప్తమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం, హస్తోదకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో అలంకరించారు. పీఠాధిపతి బృందావనానికి మహామంగళహారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వాదించారు.

గురువు ద్వారానే జ్ఞానం



ప్రచారం నిర్వహిస్తున్న త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారకులు

గోనెగండ్ల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గురువును ఎంత గౌరవించి విద్యపొందితే అంత జ్ఞానాన్ని సులభతరంగా పొందవచ్చని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యులు రంగస్వామి, శేఖర్, శ్రీను అన్నారు. ఆదివారం గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె గ్రామంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హిందు మతం యొక్క గొప్పతనాన్ని సనాతన ధర్మం గురించి వివరించారు. బావన జగదీష్, మహేశ్వరి, రామమ్మ, ఆయమ్మ పాల్గొన్నారు.

గెలుపు, ఓటములు సహజమే

కౌతాళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఎరిగేరిలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నబసప్ప, అంబేడ్కర్ సంఘం నాయకులు వీరేష్ మాట్లాడుతూ గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహించామన్నారు. ఫైనల్‌లో ఆదోని మండలం గణేకల్లు, బల్లెకల్లు గ్రామాలకు చెందిన జట్లు తలపడ్డాయి. గణేకల్లు జట్టుపై బల్లెకల్లు గ్రామానికి చెందిన భజరంగ జట్టు విజేతగా నిలిచింది. తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప మొదటి బహుమతిని సొంతంగా రూ. 20వేలు అందజేయగా, ద్వితీయ స్థానంలో నిలిచిన గణేకల్లు జట్టుకు కౌతాళం గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కోసిగి జట్టుకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు బసవరాజు రూ.7వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన ఎరిగేరి జడ్పీ పాఠశాల జట్టుకు జనసేన మండల నాయకుడు బదినేహల్ చిన్న రూ.5వేలను అందజేశారు. దాతలకు సంఘం తరపున పూలమాల వేసి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామలింగ, టీడీపీ నాయకులు రాజబాబు, సిద్ధూ ఉన్నారు.

సమస్యల వలయంలో పెద్దకడబూరు

● అపరిశుభ్రంగా వీధులు
● రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు

పెద్దకడబూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం అభివృద్ధికి ఆమడదూరంలో నిలుస్తోంది. మండలంలో దాదాపు 20వేల జనాభా ఉన్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. కాలువల ద్వారా దుర్వాసన వెదజల్లుతుంది. దోమల బెడద అధికం కావడంతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. మండల కేంద్రానికి రెగ్యూలర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో ఇన్‌చార్జి పాలన కొనసాగుతుంది. సమస్యలను పరిష్కారించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

● **మురుగు కూపంగా వీధులు**

మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఎంపీడీవో, సచివాలయ అధికారులు కార్యాలయాలకు వెళ్లే రహదారి మురుగు కూపంగా మారింది. నిత్యం ప్రజలు వివిధ సమస్యల నిమిత్తం ఎంపీడీవో కార్యాలయానికి వస్తుంటారు. పక్కనే అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీయూపీ పాఠశాల ఉన్నాయి. అక్కడే చెత్త వేస్తున్నారు. హోటల్‌లో తినిపారేసిన చెత్తాచెదారం సైతం అక్కడ వేస్తున్నారు. దాంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఈ రహదారి గుండా నడవాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు సైతం ఈ దారిలోనే ప్రయాణం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. దళిత కాలనీలోని ప్రధాన రహదారి పక్కన అంబేడ్కర్ విగ్రహం ముందు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నిలుస్తోంది. మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దళిత కాలనీ వైపు అధికారులు చిన్న చూపు చూడడం సరికాదని స్థానికులు వాపోతున్నారు. అలాగే అంతర్గత రోడ్లు వేయకపోవటంతో నేటికి మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో సీసీ రోడ్లు వేసినా నాసిరకంగా నిర్మించి చేతులు దులుపుకున్నారు. అంతర్గత రోడ్లు ఏర్పాట్లు శ్రీకారం చుట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.





బీసీ కాలనీలో రోడ్డుపై నిలిచిన మురుగు, ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారిపై పేరుకుపోయిన చెత్త

● **శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంక్**

మండలంలోని లక్ష్మీపేటలోని 60వేల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దాదాపు దశాబ్దకాలం క్రితం నిర్మించిన నీటి ట్యాంక్ మరమ్మతులకు గురైనా పట్టించుకున్న పాపాన పోలేదు. ట్యాంక్ చుట్టు గోడలు చీలిసీరు కారుతూ మరమ్మతులకు గురై కూలే దుస్థితి చేరింది. ట్యాంక్ పక్కన ఉన్న కాలనీవాసులు ట్యాంక్ ఎప్పుడు కూలుతుందోనని భయపడుతున్నారు. అధికారులు శిథిలావస్థకు చేరిన ట్యాంక్‌ను పరిశీలించి దానికి మరమ్మతులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్యం పనులు చేపట్టాలి



పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో వీధులు అన్ని అపరిశుభ్రంగా ఉన్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అయినా అధికారులకు చీమకుట్టినట్టుగా లేదు. ప్రజా ఆరోగ్యం పట్ల వారికి ఏ మాత్రం ధ్యాస లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

\- పరమేష్, సీపీఎం నాయకుడు

మూడు రోజుల్లో పారిశుధ్యం పనులు చేపడతాం

మండలంలోని మూడు రోజుల్లో పారిశుధ్య పనులు చేపడతాం. కాల్వల్లో పూడిక తీయిస్తాం. రోడ్డు శుభ్రం చేయిస్తాం. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి.

\- జయరాముడు, ఎంపీడీవో, పెద్దకడబూరు

బకాయిలు చెల్లించాలి

ఏపీ ఇరిగేషన్ ఎల్లెల్సీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న రామేశ్వరరెడ్డి

గోనెగండ్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇరిగేషన్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలన వెంటనే చెల్లించాలని ఏపీ ఇరిగేషన్ ఎల్లెల్సీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామేశ్వరరెడ్డి, మగ్బుల్ బాషా, జిల్లా అధ్యక్షుడు అంజినయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్లెల్సీ ఇరిగేషన్ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గులామ్‌మోదిన్, ప్రధాన కార్యదర్శిగా ఉగ్రనరసింహులు, కోశాధికారిగా క్రిష్ణం నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాదన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా వన్ను రుస్వామి, మల్లికార్జున, తిరుమలేష్, గౌరవఅధ్యక్షుడిగా అంజినయ్య, సలహా దారుడిగా రామేశ్వరరెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పీర సాహెబ్‌లు ఎన్నికయ్యారు.